మెరుగైన వైద్య సేవలందించాలి

జగిత్యాల, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ ప్రత్యేక అధికారి ఆర్.వి.కర్ణన్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్‌తో కలిసి జగిత్యాల మాతాశిశుకేంద్రాన్ని తనిఖీ చేశారు. అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సదుపాయాలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని రోగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డిజిటల్ సర్వేను పరిశీలించారు. జగిత్యాల 9వ వార్డు, మండలంలోని ఒడ్డెరకాలనీలో సర్వే తీరును అడిగి తెలుసుకున్నారు. కుటుంబ నిర్ధారణ వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ బి.గౌతంరెడ్డి, ఆర్డీవో పి.మధుసూదన్, వైద్యాధికారులు డాక్టర్ షమియొద్దీన్, డాక్టర్ జైపాల్‌రెడ్డి, వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఖాదీల్ తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న ప్రత్యేక అధికారి ఆర్.వి.కర్ణన్, కలెక్టర్ బి.సత్యప్రసాద్

చంద్రప్రభ వాహనంపై శ్రీవారు



కోరుట్ల పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహం రథంపై నెలకొల్పి పట్టణంలోని పురవీధులగుండా ఊరేగింపు చేపట్టారు. **- న్యూస్‌టుడే, కోరుట్ల**

నేనెందుకు చెరువుకు చేరలేదు..

చేప పిల్ల అంతర్మథనం

అనగనగా.. నేను ఒక చేపపిల్లను.. ఎందుకో ఈసారి నాతోపాటు చాలా చిరు చేపలు చెరువులకు చేరలేదు. వర్షాలు బాగానే కురిశాయి. వాగులు వంకలు పొంగిపొర్లాయి. చెరువులు నిండాయి. కానీ మా పెంపకానికి సరిపడే విధంగా మమ్మల్ని ఉమ్మడి జిల్లాకు తీసుకు రాలేదు. పాపం.. నాలుగు జిల్లాల్లో 53,859 మంది మత్స్యకారులు గంపెడాశలతో మా కోసం ఎదురు చూస్తున్నారు. మేము సకాలంలో జలాశయాల్లోకి చేరి పెరిగి పెద్దయితే.. వారికి ఎనలేని సంబరం. 772 మత్స్య సహకార సంఘాలకు మా పెంపకం జీవనాధారం. ఆగస్టు నెల ఆరంభంలోనే ఎల్లంపల్లి, ఎగువ, మధ్య, దిగువ మానేరు జలాశయాల్లో మమ్మల్ని వదలాలి. 3,235 చెరువుల్లోకి చేర్చాలి. కానీ మా పంపిణీకి అవసరమైన టెండర్లకు గుత్తేదారులు అనాసక్తి చూపడంతో ఈ ఆలస్యం జరిగిందట. నిజానికి ఈ వానాకాలం ముందరే అంటే ఏప్రిల్, మే నెలల్లోనే ఈ ప్రక్రియ చేపట్టాలి. అప్పట్లో ఎన్నికల కోడ్ వల్ల ఇబ్బంది ఎదురైంది. తరువాత మా సరఫరాపై సకాలంలో దృష్టి పెట్టకపోవడం, గుత్తేదారుకు కమీషన్ తక్కువ ఉంటుండటంతో ఇబ్బంది జరిగింది. ఉత్పత్తి కేంద్రాల్లోనూ అనుకున్న లక్ష్యానికి తగినట్లు మా సంతతి లేకపోవడంతో పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఇంకా జాప్యం జరుగుతోంది.

కరీంనగర్‌కే పరిమితం..

బొమ్మెలు, బొచ్చెలు, జెల్లలు, రాహు, బంగారు తీగ, ముల్లంగి తదితర రకాల్లోని మా ఉనికికి ఉమ్మడి జిల్లా జలాశయాలు అనువైన ప్రాంతం. కానీ దురదృష్టవశాత్తు ఈ సారి కరీంనగర్ దిగువ మానేరు జలాశయంలోనే ఈ నెల 3న 15 లక్షల మా తోటి చేపపిల్లల్ని ప్రజాప్రతినిధులు, అధికారులు వదిలారు. ఈ ఒక్క చోటే 30 లక్షలను పెంచాలని లక్ష్యం. కానీ సగంతోనే సరిపెట్టారు. ఈ జలాశయంపై ఆధారపడిన 2 వేల కుటుంబాలవారు ఇవి ఏ మేర సరిపోతాయనే ఆందోళనలో ఉన్నారు. ఈపాటికే మమ్మల్ని వదిలి ఉంటే.. ఈ ఒక్కచోటే 1,920 టన్నుల బరువు రూపంలో దిగుబడి.. రూ.11.50 కోట్ల ఆదాయం సమకూరేది. ఈ ఆలస్యం వల్ల మా ఎదుగుదలలో కచ్చితంగా లోపమేర్పడి జాలరులకు ఆర్థికంగా నష్టం వాటిల్లే అవకాశముంది. గతేడాదిలో నాలుగు జిల్లాల్లోని చెరువులు, కుంటలు, జలాశయాల్లో మొత్తంగా 6.08 కోట్ల మేర మమ్మల్ని వదిలారు. ఈసారి కూడా దాదాపుగా 7 కోట్ల వరకు మమ్మల్ని జలవనరుల్లో వదలాలని భావించినా.. అనుకున్న పురోగతి లేదు. మరో వారంలో మూడు జిల్లాల్లో పంపిణీ చేస్తామనే మాటలు ఆచరణకు నోచుకుంటేనే మా ఉనికికి ఊపిరి అందే వీలుంది. మత్స్యకారులు ఇదే ఆశతో మా రాక కోసం నిరీక్షిస్తున్నారు. అసలే ఆలస్యమైందని.. అందులోనూ అరకొరగానే పంపిణీ చేసిన తీరుపై సంఘాల సభ్యులు ఆవేదన చెందుతున్నారు.

చెప్పలేనన్ని ఇక్కట్లు..

- మా మీదే ఆధారపడిన మత్స్యకారులకు అడుగడుగునా కష్టాలే ఎదురవుతున్నాయి. జాలరుల దోసిళ్లలో పిల్లలుగా మేమున్నప్పుడు వాళ్ల కళ్లలో చూసిన సంతోషం.. మేము పెద్దయ్యాక వలలో చిక్కుకున్నప్పుడు కనబడటం లేదు.
- మత్స్యశాఖ అధికారులు ముందు నుంచి అంచనాలు వేసి పంపిస్తున్న స్థాయిలో నీళ్లలోకి మేము చేరడం లేదు. కాగితాల్లో పక్కాగా మా సంఖ్య ఉంటున్నా.. జలంలోకి వదిలే సమయంలో తక్కువ పంపిణీతో అక్రమాలు జరుగుతున్నాయి.
- నీళ్లలో మమ్మల్ని జార విడిచేటప్పుడు 35 నుంచి 40 మి.మీ.ల పరిమాణంలో ఉంటాం. మమ్మల్ని పట్టుకునే సమయానికి కిలో నుంచి కిలోన్నర బరువు మేము తూగాలి. కానీ విపరీతమైన ఎండలు, కలుషిత నీటి వల్ల మా జాతిలో చాలా ముందే మరణిస్తున్నాయి.
- సంఘాల సభ్యులకు మార్కెటింగ్ సహా ఇతర సౌకర్యాల పరంగా ఇబ్బందులను అధికారులు తీర్చాలి. ఏడాదికి 6 కోట్లకుపైగా పంపిణీ చేస్తే మేము పెరిగి పెద్దై 6వేల టన్నుల దిగుబడిగా మారాలి. కానీ 3-4 వేల టన్నుల దిగుబడే వస్తుండటం బాధాకరం.
- ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా దృష్టి పెట్టి మా సంతతి కోసం కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో ఉన్న ఉత్పత్తి కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించాలి. మా మీదే ఆధారపడిన మత్స్యకారుల ఆర్థిక ప్రగతికి తోడ్పడే చర్యల్ని తీసుకోవాలి.

– ఈనాడు, కరీంనగర్

కదం తొక్కిన కర్షకులు

కలెక్టరేట్ ఎదుట ధర్నా, రాస్తారోకో


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

జగిత్యాల, న్యూస్‌టుడే: షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, అన్ని రకాల వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని ఎకరానికి రూ.15 వేల రైతుభరోసా ఇవ్వాలని జిల్లా కేంద్రంలో శుక్రవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు ధర్నా నిర్వహించారు. పాత మార్కెట్‌యార్డు నుంచి ర్యాలీగా కొత్తబస్టాండ్ మీదుగా కరీంనగర్ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వైపు వెళ్లకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాట్లు చేయగా రైతులు రహదారిపై బైఠాయించారు. అధిక సంఖ్యలో వాహనాలు నిలిచిపోగా దారి మళ్లించారు. ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కావడంతో రైతులను కలెక్టరేట్ వైపు అనుమతించారు. దీంతో కలెక్టరేట్ ప్రధాన ద్వారం ముందు సుమారు 3 గంటల పాటు ధర్నా నిర్వహించారు. భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు. కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించడంతో రైతులు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి అధికారంలోకి తెచ్చారన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని రుణమాఫీ అమలులో ఆంక్షల మూలంగా ఆందోళన చెందుతున్నారని పట్టాదారు పాసుబుక్ ఆధారంగా ప్రతిఒక్కరికి రుణమాఫీ వర్తింపజేయాలని లేనట్లయితే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. రైతు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నల్ల రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. వానాకాలం పంటసీజన్ పూర్తయినప్పటికి పెట్టుబడి సాయం ఇవ్వడం లేదన్నారు. వేముల కరుణాకర్‌రెడ్డి, మిట్టపల్లి తిరుపతిరెడ్డి, కర్నే రాజేందర్, బందెల మల్లయ్య, బద్దం మహేందర్‌రెడ్డి, గడ్డం రాజిరెడ్డి, అయిల్నేని సాగర్‌రావు, ఏలేటి నర్సింహరెడ్డి, ఆదిరెడ్డి, తిరుపతి, రమేష్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రైతులు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కొద్దిసేపు తోపులాట జరిగింది. డీఎస్పీ డి.రఘుచందర్, సీఐలు సూరం వేణుగోపాల్, క్రిష్ణారెడ్డి, ఆరిఫ్‌అలీఖాన్ తదితరుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్లకార్డుతో..


స్పృహ తప్పిపడిపోయిన రైతు

బ్రహ్మచారిణి రూపంలో దుర్గాదేవి



జగిత్యాల పట్టణంలో దేవీ శరన్నవరాత్రులు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నవదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో పీఠ క్షేత్రంలో, కనకదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో అమ్మవారు బ్రహ్మచారిణి రూపంలో కొలువుదీరారు. శ్రీజయదుర్గా, సువర్ణదుర్గ, వనదుర్గ, దుర్గాభానీ సేవాసమితులు, భక్త బృందాల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. **– న్యూస్‌టుడే, జగిత్యాల విద్యానగర్**

టేకు వృక్షాల నరికివేత

సారంగాపూర్, న్యూస్‌టుడే: మండలంలోని బట్టపల్లి అటవీప్రాంతంలో టేకు వృక్షాలను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసి ఎత్తుకెళ్లారు. గ్రామస్థులు గుర్తించి అటవీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు ప్రారంభించారు. బట్టపల్లి నుంచి నేరేళ్లకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న నాలుగు భారీ టేకు వృక్షాలను బుధవారం రాత్రి నరికివేసి ఎత్తుకెళ్లారు. గతంలోనూ పలు వృక్షాలు స్మగ్లర్లు నరికివేసి అక్రమంగా తరలిస్తున్నారని, వెంటనే వారిని పట్టుకుని చర్యలు తీసుకోవాలంటూ గ్రామస్థులు అటవీ అధికారులను కోరారు. డిప్యూటీ రేంజర్ రవికుమార్ మాట్లాడుతూ కేసు నమోదు చేశామని, స్మగ్లర్లను గుర్తించి టేకు కలపను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.


స్మగ్లర్లు నరికివేయగా మిగిలిన మోడు

జిల్లా వ్యవసాయాధికారిగా రాంచందర్



జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: జగిత్యాల జిల్లా వ్యవసాయాధికారిగా ధర్మపురి ఏడీఏ సీహెచ్.రాంచందర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యవసాయాధికారిణిగా పనిచేసిన జగిత్యాల ఏడీఏ బి.వాణిని వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో రిపోర్టు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ సంచాలకులు ఉత్తర్వులు వెలువరించారు. డీఏవోగా బాధ్యతలు స్వీకరించిన రాంచందర్‌కు ఏవోలు, ఏఈవోల సంఘం జిల్లా నాయకులు తిరుపతి నాయక్, భూక్య సురేందర్, శ్రీనివాస్ తదితరులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

ఆపన్న హస్తం

ఫిర్యాదులకు పోలీసుల తక్షణ స్పందన


రామగుండం కమిషనరేట్‌లో డయల్ 100 ఫిర్యాదులను పర్యవేక్షిస్తున్న సిబ్బంది

ఈనాడు, పెద్దపల్లి, న్యూస్‌టుడే, సిరిసిల్ల గ్రామీణం, జగిత్యాల, గోదావరిఖని

- గోదావరిఖని ఎల్‌బీ నగర్‌కు చెందిన ఓ చిరుద్యోగి కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. కొనుగోలు చేసిన ఇంటికి నెలవారీ కిస్తీలు కట్టలేకపోవడం, బ్యాంకు వాళ్లు నోటీసులు పంపిస్తుండటంతో ఇంట్లో గొడవలు ప్రారంభమయ్యాయి. సెప్టెంబరు 20న గొడవ పెరగడంతో స్థానికులు 100 నంబరుకు ఫోన్ చేశారు. బ్లూకోల్ట్స్ పోలీసులు అక్కడికి చేరుకుని కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి వెళ్లారు. తరవాత చిరుద్యోగి భార్య ఇంటి తలుపులు మూసుకుని నిద్రమాత్రలు మింగడంతో కుటుంబ సభ్యులు మళ్లీ 100కు ఫోన్ చేశారు. పోలీసులు వెంటనే వచ్చి తలుపులు తెరిచి 108కి సమాచారం ఇచ్చి ఆమెను ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడారు.
- సెప్టెంబరు 10న సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన 81 ఏళ్ల వృద్ధుడు అదృశ్యమయ్యారు. కుటుంబసభ్యులు 100కు ఫోన్ చేశారు. సిరిసిల్ల టౌన్ ఎస్సై శ్రీనివాస్ బృందాలుగా విడిపోయి ఆచూకీకి వెతకగా వంశీకృష్ణ కాలనీలో స్పృహ తప్పి పడిపోయినట్లు గుర్తించి 108కి సమాచారం అందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆపదకాలంలో ఆపన్న హస్తంగా పోలీసుల ‘డయల్-100’ బాధితులకు భరోసానిస్తోంది. ప్రతి జిల్లా ఎస్పీ కార్యాలయం, కమిషనరేట్ పరిధిలో డయల్ 100 పర్యవేక్షణకు ఒక కంట్రోల్ రూమ్ ఉంటుంది. ఇందులో ఒక సీఐ స్థాయి అధికారితోపాటు ముగ్గురు హెడ్ కానిస్టేబుల్స్, ఆరుగురు కానిస్టేబుల్స్ మూడు షిఫ్టులలో విధులు నిర్వహిస్తూ ఫోన్ కాల్స్‌ను పర్యవేక్షించడంతోపాటు బ్లూకోల్ట్స్ సిబ్బందిని అప్రమత్తం చేస్తారు.

DIAL 100

ఎలా పని చేస్తుందంటే?

- ఆపదలో ఉన్నవారు, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై డయల్ 100కు ఫోన్ చేస్తే వెంటనే కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది.
- సమాచారం అందుకున్న సిబ్బంది పట్టణ, నగర ప్రాంతాలైతే 10 నిమిషాల్లో.. మారుమూల గ్రామీణ ప్రాంతమైతే అరగంటలో చేరుకోవాలి.
- వెంటనే ట్యాబ్‌లో ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను నిక్షిప్తం చేసి ప్రాథమిక సమాచారం కంట్రోల్ రూమ్‌కు పంపిస్తూనే తగిన సహాయక చర్యలు చేపట్టాలి.



నిర్భయంగా చేయండి..

- **డయల్ 100కు ఉమ్మడి జిల్లాలో గత ఏడాది కాలంలో లక్షకు పైగా ఫిర్యాదులు వచ్చాయి.**
- ఆపదలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై 100కు ఫిర్యాదు చేయవచ్చు. ఫోన్ చేస్తే సాక్ష్యం చెప్పాల్సి వస్తుందనే భయం అవసరం లేదు. డయల్ 100కు ఫోన్ చేస్తే సాక్ష్యం చెప్పాల్సిన పని లేదని అధికారులు చెబుతున్నారు.

ఒక్కో సమయంలో ఫిర్యాదులు ఇలా..

- **సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు :** రహదారులపై ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడలో బంగారు గొలుసుల చోరీ, ఆకతాయిల ఆగడాలు
- **రాత్రి 9 గంటల నుంచి :** మద్యం మత్తులో తాగుబోతుల ఆగడాలు, రహదారులపై వాగ్వాదాలు, గొడవలు, రౌడీ షీటర్ల అరాచకాలు.
- **రాత్రి 10 గంటల తరవాత :** భార్యాభర్తల మధ్య గొడవలు, గొడవలతో ఇంటి నుంచి బయటకు గెంటేసిన.. మద్యం సేవించి ఇంట్లో వారిపై, చుట్టుపక్కల వారిపై భౌతిక దాడులకు పాల్పడటం, హత్యాయత్నానికి పాల్పడుతామని బెదిరింపులు
- **అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు :** తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు, రహదారి ప్రమాదాలు, మద్యం గొలుసు (బెల్ట్) దుకాణాల నిర్వహణపై

మహిళల నుంచి వస్తున్న ఫిర్యాదులు : ఆకతాయిల వేధింపులు, ఫోన్‌లో అసభ్య చాటింగ్, ర్యాగింగ్, తాగుబోతుల అరాచకాలు, భర్తల వేధింపులు, ఆత్మహత్యాయత్నాలు, గృహహింస

పురుషుల నుంచి : రహదారి ప్రమాదాలు, వాగ్వాదాలు, పశువుల అక్రమ రవాణా, రేషన్ బియ్యం, గుట్కా దందా, మద్యం గొలుసు దుకాణాల విక్రయాలు

ఏడాది కాలంలో..

జిల్లా	వచ్చిన ఫిర్యాదులు	నమోదైన కేసులు
పెద్దపల్లి	55,969	571
రాజన్న సిరిసిల్ల	13,434	256
జగిత్యాల	26,613	293

భగీరథ పనుల పూర్తికి నిధులు

న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం

మెట్‌పల్లి పురపాలికకు రూ.19 కోట్లు మంజూరు

గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ అసంపూర్తి పనుల పూర్తికి ప్రభుత్వం రూ.19 కోట్లు మంజూరు చేసింది. మెట్‌పల్లి పట్టణంలో 26 వార్డులకు భగీరథ నీటిని అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పట్టణంలో ఇప్పటి వరకు 112 కి.మీ భగీరథ పైపులైన్లు వేయగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో 15 లక్షల లీటర్లు, ఖాదీలో 12 లక్షలు, వ్యవసాయ మార్కెట్‌లో 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల మూడు పెద్ద ట్యాంకులను నిర్మించారు. మొత్తం 10 వేల నల్లా కనెక్షన్ల ద్వారా సుమారు 70 లక్షల లీటర్ల నీటిని ప్రతి రోజు సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ నీటిని వినియోగించుకుంటున్న వారికి నుంచి నెలానెలా రూ.200 చొప్పున బల్దియా అధికారులు బిల్లులను కూడా వసూలు చేస్తున్నారు.

పురపాలిక పరిధిలోని పలు వార్డులలో పైపులైన్‌తో పాటు ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చేందుకు రెండో విడత ప్రత్యేక నిధులు మంజూరయ్యాయి. అమృత్ 2.0 పథకం కింద మంజూరైన రూ.19 కోట్లతో సుమారు 25 కి.మీ వరకు భగీరథ పైపులైన్‌తో పాటు అక్కడక్కడ మిగిలిపోయిన పనులను పూర్తి చేయనున్నట్లు డీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. ప్రస్తుతం పురపాలికలో విలీనమైన రెండు గ్రామాలు ఆరపేట, వెంకట్రావుపేటతో పాటు అర్బన్‌కాలనీలో భగీరథ పైపులైన్ వేసి ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. పనుల కోసం ఇప్పటికే టెండర్‌తో పాటు పనుల అగ్రిమెంట్ కూడా పూర్తయిందని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని డీఈ తెలిపారు.

రూ.200 వసూలు

పురపాలిక పరిధిలోని పలు వీధుల్లో గతంలో పాత పైపులైన్ ద్వారా సరఫరా అయిన నీరు కొన్ని రోజుల తర్వాత నిలిచిపోయింది. పట్టణంలో సుమారు 500 వరకు కనెక్షన్లు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం పాత బకాయిలు చెల్లించాలని బిల్ కలెక్టర్లు ఇంటింటికీ తిరుగుతున్నారు. బిల్లులు చూసి సమస్య పరిష్కారం కోసం పురకార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయమై కమిషనరు మోహన్‌ను ‘న్యూస్‌టుడే’ వివరణ కోరగా మిషన్ భగీరథ పైపులైన్ల మరమ్మతు నిర్వహణ కోసం రూ.200 వసూలు చేస్తున్నామని తెలిపారు. పాల నల్లా కనెక్షన్లకు సంబంధించి సిబ్బందితో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.


తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన భగీరథ ట్యాంకులు

ఉత్సవాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

కోరుట్ల, న్యూస్‌టుడే: దసరా, బతుకమ్మ ఉత్సవాల కోసం గ్రామాల్లో పంచాయతీ నిధులతో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కథలాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాల అధికారులు, ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బతుకమ్మ సంబరాల సందర్భంగా వీధి దీపాల తోపాటు కూడళ్లలో హైమాస్టు లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. డీపీవో రఘువరణ్, ఆర్డీవో శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి మదన్‌మోహన్, ఎంపీడీవోలు శంకర్, పద్మావతి, తహసీల్దార్ వినోద్, వసంత, రవికిరణ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.


కథలాపూర్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రికార్డులకు భద్రత కరవు!



సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సర్వేశాఖ హాలులో జిల్లాలోని భూములకు సంబంధించిన సర్వే రికార్డులను ఉంచారు. సర్వే అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, మరో వైపు సర్వే రికార్డులు ఒకే హాలులో ఉన్నాయి. ప్రత్యేకంగా మధ్యలో ఎలాంటి గోడ ఏర్పాటు చేయలేదు. గతంలో ఉన్నతాధికారులకు నివేదించినప్పటికీ, నిధుల విడుదలలో జాప్యం కారణంగా రికార్డులకు భద్రత లేకుండా పోయింది. **– న్యూస్‌టుడే, జగిత్యాల విద్యానగర్**

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక


నందిని

కోరుట్ల : మ్యాస్ట్రో జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న బండ నందిని అండర్-19 విభాగంలో రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఆకుల రాజేశ్ శుక్రవారం తెలిపారు. ఇటీవల జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకం కైవసం చేసుకొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది.

ధ్రువపత్రాల పరిశీలనకు నేడు చివరిరోజు

జగిత్యాల : డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు శనివారం చివరిరోజని జిల్లా విద్యాధికారి డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు హాజరు కాని స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, పీఈటీ, లాంగ్వేజ్ పండిత్ పోస్టుల సంబంధించిన అభ్యర్థులు శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు టీచర్స్‌భవన్‌లో జరిగే ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలన్నారు. హాజరు కాని అభ్యర్థులు ఉద్యోగ అవకాశాన్ని కోల్పోతారని పేర్కొన్నారు.

ఆహార శుద్ధికి అడుగులు

- మూడేళ్లకు తొలి యూనిట్ పూర్తి
- అనుమతుల ధ్రువీకరణకు సన్నాహక ఉత్పత్తి

ఈనాడు, సిరిసిల్ల

వస్త్రోత్పత్తులు.. దుస్తుల తయారీయే కాదు జిల్లాలో వీటి సరసన ఆహారశుద్ధి పరిశ్రమలూ చేరుతున్నాయి. మూడేళ్ల క్రితం నర్మాలలో ఆహారశుద్ధి హబ్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. ప్రస్తుతం అందులోని తొలి యూనిట్‌లో ట్రయల్ రన్ జరుగుతోంది. మరిన్ని రోజుల్లో పూర్తిస్థాయిలో ఉత్పత్తులు మార్కెట్‌లోకి తీసుకొచ్చేలా కంపెనీ యాజమాన్యం ప్రణాళికలు చేస్తుంది. ఇది పూర్తిస్థాయి ఫలితాలను ఇవ్వడం ప్రారంభిస్తే జిల్లాలో పంట ఉత్పత్తులకు విలువలు జోడిస్తూ రైతు కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతుంది. సాగులోనూ అనూహ్య మార్పులు వస్తాయి. నైపుణ్యం ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.





నర్మాలలో నిర్మాణం పూర్తయిన ఆహారశుద్ధి పరిశ్రమ



అంతర్గత రహదారుల నిర్మాణ పనులు

రూ.10 కోట్ల పెట్టుబడి

జిల్లా సరిహద్దులోని గంభీరావుపేట మండలం నర్మాలలో ఆహారశుద్ధి పరిశ్రమలకు 2017-18లో 350 ఎకరాల భూమిని సేకరించారు. అందులో 2021లో దుబాయ్‌కు చెందిన అగస్త్యా ఆహారశుద్ధి పరిశ్రమ ముందుకొచ్చింది. 3.5 ఎకరాల్లో రూ.10 కోట్ల పెట్టుబడితో మూడేళ్లకు పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఉత్పత్తుల దిశగా అడుగులు పడుతున్నాయి. పరిశ్రమల పరమైన అన్ని రకాల తనిఖీలు, ఆయా శాఖల నుంచి ధ్రువీకరణల ప్రక్రియలు ముగిశాకే పూర్తిస్థాయి ఉత్పత్తులు మార్కెట్‌లోకి వస్తాయి.

■ ఒక షిప్టులో 8 టన్నుల ధాన్యం ప్రాసెసింగ్ చేసే సామర్థ్యం ఉంది. దీనిలో రాగులు, జొన్న, సజ్జలతో ఆహార ఉత్పత్తులు తయారవుతాయి. మార్కెట్‌లోకి వీటి ఉత్పత్తులు ప్రారంభమయ్యాక, ఇదే కంపెనీకి చెందిన మరో రెండు పరిశ్రమల నిర్మాణం ఈ హబ్‌లో ప్రారంభించనున్నారు.

చిరుధాన్యాలకు డిమాండ్

ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో అన్ని రకాల పంటలు కలిపి 11 లక్షల ఎకరాలు సాగైంది. వీటిలో 3.37 శాతం మాత్రమే చిరు ధాన్యాలు ఉన్నాయి. 2020లో ఇవి 7.15 శాతం ఉండేవి. జలాశయాల నిర్మాణంతో సాగునీటి లభ్యత పెరిగింది. దీంతో రైతులు వరి, పత్తి పంటలకే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. దీనికితోడు పక్కనే ఉన్న ఉమ్మడి నిజామాబాద్, మెదక్ జిల్లాల్లోనూ చిరుధాన్యాల సాగు అంతంత మాత్రంగానే ఉంది. దీంతో పక్క రాష్ట్రాల్లోనూ కంపెనీ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఉత్పత్తులు సేకరించేలా రైతుల వద్దకు వెళ్తున్నారు.



■ జిల్లాలోనూ వ్యవసాయశాఖ, ఇతర అనుబంధ రంగాలతో కలిసి రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించి వారితో కలిసి సాగు చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఈ కంపెనీకి తెలంగాణ, కర్ణాటకలో మూడు చోట్ల పరిశ్రమలు ఉన్నాయి. ఇటీవల కాలంలో ప్రజల్లోనూ చిరుధాన్యాల వినియోగం పెరుగుతోంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని తమ ఉత్పత్తులను పూర్తిగా సేంద్రియ విధానంలోకి తీసుకెళ్లేలా ప్రణాళికలు చేస్తున్నారు.

■ టీజీఐఐసీ, ఎంఎస్ఎంఈలో భాగంగా ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలున్నాయి. అక్షయ అగ్రిటెక్ అనే సంస్థకు వ్యవసాయ ఉపకరణాల తయారీ పరిశ్రమ కోసం ఇందులో స్థలం కేటాయించారు. మరో రెండు సంస్థలు ప్రభుత్వం వద్ద ఎంవోయూ దశలో ఉన్నాయి. మౌలిక వసతుల కల్పనపై టీజీఐఐసీ జిల్లా మేనేజర్ బహుగుణను 'ఈనాడు' సంప్రదించింది. రూ.13 కోట్లతో జరుగుతున్న పనుల్లో వేగం పెంచినట్లు తెలిపారు. ప్రస్తుతం అంతర్గత రహదారుల పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్తు, తాగునీటి వసతులు కల్పిస్తున్నామన్నారు.

ధాన్యం ఆరబెట్టే యంత్రం

యువ రైతు ఆలోచనలకు రూపం

న్యూస్‌టుడే, జగిత్యాల గ్రామీణం



ధాన్యం ఆరబెట్టే యంత్రం



కిషన్ కుమార్

ఏటా అకాల వర్షాలతో ధాన్యం తడవడం.. తేమ శాతం ఎక్కువగా ఉందని కొనుగోలు చేయకపోవడం.. మొలకలు రావడంతో రైతులకు తీవ్ర నష్టం కలుగుతోంది.. తడిచిన ధాన్యం ఆరబెట్టేందుకు తాను పడ్డ ఇబ్బందులు ఇతరులు పడొద్దని.. ఎలాగైనా ధాన్యం ఆరబెట్టే యంత్రాన్ని తయారు చేయాలని మూడు యంత్రాలు తయారు చేసి విఫలమయ్యాడు. పట్టు వదలని విక్రమార్కుడిలా గతంలోని లోపాలను సరిదిద్దుకుంటూ దాదాపు తొమ్మిదేళ్లపాటు శ్రమించి ధాన్యం ఆరబెట్టే యంత్రాన్ని తయారుచేశాడు జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికెపల్లికి చెందిన యువ రైతు గోనె కిషన్‌కుమార్. ఈ యంత్రం ద్వారా అప్పటికప్పుడు తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు వీలుకలుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు ధాన్యం ఆరబెట్టేందుకు భారీ యంత్రాలు ఉండగా రైతులకు అందుబాటులో తక్కువ ధరలో యంత్రాన్ని తయారు చేసినట్లు కిషన్‌కుమార్ వివరించాడు.

యంత్రం పనితీరు ఇలా..

హీటర్లు, భారీ ఫ్యాన్లు, కన్వేయర్ బెల్టు, వీఎఫ్‌డీ, టెంపరేచర్ కంట్రోలర్, 3 త్రీఫేజ్ మోటార్లతో యంత్రాన్ని తయారు చేశాడు. ధాన్యాన్ని యంత్రంలో పోసిన తర్వాత 200 డిగ్రీల వేడిలో ఫ్యాన్ల సాయంతో తేమ శాతం 15 నుంచి 17 శాతానికి చేరుకుంటుంది. గంటకు 100 బస్తాల వరకు తడిచిన ధాన్యం, మక్కలు ఆరబెట్టుకోవచ్చని వివరించారు. యంత్రంలో ఆరబెట్టిన ధాన్యం నారుపోసేందుకు జెర్మినేషన్ సమస్య కూడా లేదని తానే స్వయంగా నారు పోసి పరిశీలన చేసినట్లు తెలిపారు. ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2019లో పరిశ్రమలపై శిక్షణ పొందిన కిషన్‌కుమార్‌కు కేంద్ర ప్రభుత్వం అందించే ఆర్‌కేవీవై రఫ్తర్ ఏబీఐ పథకంలో రెండేళ్ల కిందట రూ.4.50 లక్షలు తిరుపతి యూనివర్సిటీ నుంచి అందజేశారు. యంత్రం తయారీకి రూ.16 లక్షలు ఖర్చయినట్లు, ప్రభుత్వం స్పందించి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తే మరిన్ని యంత్రాలు తయారు చేస్తానని వివరించారు.

పొగబట్టిన విధి

- విద్యుదాఘాతంతో ఇంట్లో మంటలు
- ఊపిరాడక ఏడేళ్ల బాలుడి మృత్యువాత



సాయికుమార్

మానకొండూర్, న్యూస్‌టుడే : యూకేజీ చదువుతున్న ఆ బాలుడు దసరా సెలవులు కావడంతో ఇంట్లో హాయిగా నిద్రిస్తున్నాడు.. తల్లి పని మీద కుమార్తెను తీసుకుని బయటకు వెళ్లింది.. కలత లేని నిద్రపోతున్న ఆ బాలుడిని అగ్ని ప్రమాదం బలి తీసుకుంది.. చుట్టూ మంటలు చెలరేగగా.. బయటకు వచ్చేందుకు ఆ బాలుడు ప్రయత్నించినా లాభం లేకపోయింది.. కమ్ముకున్న పొగ ఆ చిన్నారిని బలి తీసుకుంది.. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఈదులగట్టెపల్లిలో చోటు చేసుకున్న ఈ ఘటన కుటుంబసభ్యులను తీవ్ర ఆవేదనలో ముంచగా గ్రామస్థులను కలిచి వేసింది. పోలీసుల కథనం ప్రకారం.. అగ్గిడి అనిత, రాజు దంపతులకు కూతురు, కుమారుడు సాయికుమార్ (7) సంతానం కాగా కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పరదాలు కూడా అద్దెకు ఇస్తారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో సాయికుమార్ ఇంట్లో పడుకుని ఉండగా తల్లి అనిత కుమార్తెను తీసుకుని బయటకు వెళ్లింది. ఇంటికి విద్యుత్తు సరఫరా అయ్యే తీగ వదులుగా ఉండటంతో గాలికి ఊగి నిప్పు రవ్వలు చెలరేగాయి. అవి ఇంటి ముందు ఉన్న పరదాలపై పడటంతో మంటలు అంటుకున్నాయి. అవి ఇంట్లోకి వ్యాపించగా ఇంట్లో ఉన్న పరదాలకు కూడా నిప్పు అంటుకుంది. నిద్ర మేల్కొన్న సాయికుమార్ బయటకు రావడానికి ప్రయత్నించినా మంటలు ఎగిసి పడుతుండటంతో వీలుకాలేదు. భయంతో మరో గదిలోకి వెళ్లాడు. అయినా పొగ ధాటికి ఊపిరి ఆడలేదు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తెచ్చి బాలుడిని బయటకు తీసుకు రాగా అప్పటికే విగత జీవుడయ్యాడు. ఇంటికి కొద్ది దూరంలోనే ఉన్న తల్లి కుమారుడిని కాపాడుకుందామని పరిగెత్తుకు వచ్చినా లోపలికి వెళ్లలేని పరిస్థితి ఉండటంతో అయ్యో బిడ్డా అంటూ గుండెలు పగిలేలా రోదించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ స్వామి తెలిపారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పల్లెల్లో మహిళా ఓటర్లే అధికం



జగిత్యాలలో ఎక్కువ.. పెద్దపల్లిలో తక్కువ

జిల్లాల వారీగా

ఉమ్మడి జిల్లాలో ఓటర్ల వివరాలు...

జిల్లా	మండలాలు	పంచాయతీలు	వార్డులు	పురుషులు	మహిళలు	ఇతరులు
జగిత్యాల	20	380	3500	2,83,010	3,10,522	8
కరీంనగర్	15	323	3022	2,57,333	2,69,894	10
పెద్దపల్లి	14	263	2436	2,01,006	2,06,697	13
సిరిసిల్ల	12	254	2230	1,67,686	1,78,553	20

న్యూస్‌టుడే, కరీంనగర్ పట్టణం

ఈసారి జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలలో మహిళా ఓటర్లు సత్తా చాటే అవకాశముంది. గ్రామ పంచాయతీ ఓటర్లకు సంబంధించి ఎన్నికల సంఘం ప్రకటించిన తుది జాబితాలో వారు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పురుషులకంటే అధికంగా ఉండటమే అందుకు కారణం. స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ మహిళలకు ప్రకటించిన సంగతి తెలిసిందే. దానికి అనుగుణంగా అతివల ఓటర్లు పెరగడం వారి పాత్ర అన్ని రంగాల్లో కనిపిస్తోంది.

18 లక్షలకు పైగా..

గ్రామ పంచాయతీ ఓటర్లకు సంబంధించి తుది జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలో 18,74,752 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 9,09,035 మంది పురుషులు, 9,65,666 మంది మహిళలు, 51 మంది ఇతరులు ఉన్నట్లు తేల్చారు. గత శాసనసభ ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం వార్డుల వారీగా గ్రామ పంచాయతీ ఓటర్లను వేరు చేసి సెప్టెంబరు 13న జాబితా ప్రకటించారు. గత నెల 14 నుంచి 21 వరకు పంచాయతీల్లో అభ్యంతరాలు స్వీకరించి 28న తుది జాబితా ప్రచురించారు.

ఉమ్మడి జిల్లా పరిధిలో జగిత్యాల జిల్లాలో పురుషులు, మహిళలు కలిపి అత్యధికంగా 5,93,540 మంది ఓటర్లు ఉండగా, రాజన్న సిరిసిల్లలో తక్కువగా 3,46,259 మంది ఉన్నారు. మిగిలిన కరీంనగర్ జిల్లాలో 5,27,237, పెద్దపల్లిలో 4,07,716 ఓటర్లు ఉన్నారు.

అనంతరం ఎన్నికల సంఘం పరిశీలించి ఖరారు చేసింది. ఈ ఓటర్ల వివరాల ప్రకారం పంచాయతీ వార్డుల్లోని ఓటర్లతో ఎన్నికల ప్రక్రియ చేపడతారు.

56,631 మంది ఎక్కువ మగువలు..

ఎన్నికల సంఘం ప్రకటించిన పంచాయతీ ఓటర్ల వివరాలను పరిశీలిస్తే మొత్తం 18 లక్షలకు పైగా ఓటర్లలో నారీమణులదే పై చేయిగా ఉంది. పురుషులకంటే 56,631 మంది అధికంగా ఉన్నారు. వీరిలో కూడా జగిత్యాల జిల్లాలో అత్యధికంగా 27,512, పెద్దపల్లిలో 5091 మంది స్వల్పంగా ఉండగా కరీంనగర్‌లో 12,651 మంది, పెద్దపల్లిలో 10867 మంది మహిళలతో రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. 51 మంది ఇతరులు ఓటు హక్కు కలిగి ఉన్నారు.

పంచాయతీల్లో సందడి..



ఎన్నికల సంఘం తుది జాబితా ప్రకటించిన తరువాత ఆయా జిల్లాల్లో పంచాయతీ, వార్డుల వారీగా పరిశీలిస్తూ రిజర్వేషన్లు ఇతర అంశాలపై ఆశావాహులు అంచనా వేసుకుంటున్నారు. గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొనే అవకాశముంది.

నేటి తరానికి మార్గదర్శకుడు రత్నాకర్‌రావు

మాజీ మంత్రి జువ్వాడి విగ్రహావిష్కరణలో మంత్రి శ్రీధర్‌బాబు



కోరుట్లలో రత్నాకర్‌రావు విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో విప్ లక్ష్మణ్‌కుమార్, జువ్వాడి నర్సింగరావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే వినోద్, ఆది శ్రీనివాస్

కోరుట్ల, న్యూస్‌టుడే: నేటితరం నాయకులు, ప్రజాప్రతినిధులకు మార్గదర్శకుడు దివంగత మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం కోరుట్ల పట్టణ శివారులోని పశువైద్య కళాశాల ముందు ఏర్పాటు చేసిన రత్నాకర్‌రావు కాంస్య విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రత్నాకర్‌రావు గ్రామ సర్పంచిగా రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి రాష్ట్ర మంత్రిగా ప్రజలకు ఎనలేని సేవలందించారన్నారు. యువ నేతలను వెన్నంటి ప్రోత్సహించారని, అయిదు పర్యాయాలు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నారంటే వారి అడుగు జాడల్లో నడవడంతోనే సాధ్యమైందని పేర్కొన్నారు. నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి నాయకత్వంలో దేవాదాయశాఖమంత్రిగా దూప, దీప నైవేద్య పథకం ప్రవేశపెట్టి ఎన్నో దేవాలయాలకు పునరుజ్జీవం పోశారన్నారు. ఈ ప్రాంత రైతులకు ఉపయోగపడేలా పశువైద్య కళాశాలను కోరుట్లకు తీసుకువచ్చారని, ఇక్కడ చదివిన వందలాది మంది విద్యార్థులు వైశువైద్యులుగా రైతులకు సేవ చేయడంతోపాటు ఉపాధి పొందుతున్నారన్నారు. ధర్మపురి ఆలయాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారు. కోరుట్ల ప్రాంతంలో తాగునీరు, సాగునీరు అందించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. రత్నాకర్‌రావుతో కలిసి 4 దశాబ్దాలుపాటు ప్రజలకు సేవ చేశామన్నారు. ఎప్పుడు గ్రామీణ ప్రాంతంలో సౌకర్యాలు కల్పించేందుకు, రైతులకు సేవచేసేందుకు పరితపించేవారన్నారు. ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, రత్నాకర్‌రావు కుమారులు కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు, శేఖర్‌రావు మంత్రి శీధర్‌బాబును సన్మానించి జ్ఞాపికను అందజేశారు. జగిత్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు డా.సంజయ్, గడ్డం వినోద్, పెద్దపల్లి, భువనగిరి ఎంపీలు గడ్డం వంశీ కృష్ణ, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్, ఆరెపల్లి మోహన్, కోరుట్ల, జగిత్యాల మున్సిపల్ ఛైర్‌పర్సన్‌లు, తదితరులు పాల్గొన్నారు.

తుది పోరుకు కరీంనగర్ క్రికెట్ జట్టు



జట్టుతో అసోసియేషన్ ప్రతినిధులు

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో కరీంనగర్ ఉమ్మడి జట్టు ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం కరీంనగర్, నల్గొండ జిల్లా జట్లు తలపడ్డాయి. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కరీంనగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 299 పరుగులు సాధించింది. వాకౌట్ పద్ధతిలో గెలుపొందింది. కరీంనగర్ జిల్లా జట్టులోని తక్షిల్ 138, అక్ద్దాం 79, రిత్విక్ 20, కమ్రాన్ 17 పరుగులు సాధించారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా తక్షిల్ ఎంపికైనట్లు జిల్లా జట్టు మేనేజర్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.మనోహర్‌రావు తెలిపారు. క్రీడాకారులను ఉపాధ్యక్షుడు వై.మహేందర్‌గౌడ్, సి.హెచ్ అజిత్‌కుమార్‌లు నగదు బహుమతులు అందించి క్రీడాకారులను ప్రోత్సహించి అభినందించారు.

కుస్తీ పోటీలు ప్రారంభం

ధన్వాడ, న్యూస్‌టుడే : నారాయణపేట జిల్లా ధన్వాడలో శుక్రవారం రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ బాలికల రెజ్లింగ్ (కుస్తీ) పోటీలు ప్రారంభమయ్యాయి. ఖమ్మం మినహా తొమ్మిది ఉమ్మడి జిల్లాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. నారాయణపేట ఎమ్మెల్యే డా.చిట్టెం పర్నికరెడ్డి పోటీలు ప్రారంభించగా, క్రీడాకారులు వందన సమర్పణ చేశారు. వర్షం పడటంతో పోటీల నిర్వహణకు అంతరాయం ఏర్పడింది.



కరీంనగర్ కుస్తీ క్రీడాకారుల వందన సమర్పణ

హ్యాండ్‌బాల్‌లో సెమీ ఫైనల్‌కు కరీంనగర్

కోస్గి న్యూటౌన్ : నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలు శుక్రవారం హోరాహోరీగా కొనసాగాయి. బాలికల విభాగంలో కరీంనగర్, ఆదిలాబాద్ జట్లు ఫైనల్‌కు చేరాయి. బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు ఫైనల్‌కు చేరగా, రెండో సెమీఫైనల్ మ్యాచ్ కరీంనగర్ - హైదరాబాద్ మధ్య శనివారం ఉదయం నిర్వహించనున్నారు.

బడి పిల్లలకు మళ్లీ రాగిజావ

పండుగ సెలవుల తర్వాత ప్రారంభం



పెద్దపల్లిలో రాగి జావ గ్లాసులు చూపుతున్న విద్యార్థినులు (పాతచిత్రం)

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

ఉదయం ఏమీ తినకుండానే పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. మూడు నెలలుగా నిలిచిపోయిన రాగిజావ పంపిణీ పునఃప్రారంభం కానుంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. దసరా సెలవుల తర్వాత ఉదయం వేళలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేయనున్నారు. పీఎం పోషణ్ పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని 1 నుంచి 10వ తరగతి పిల్లలకు రాగి జావ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఉదయం చాలా మంది పిల్లలు ఏమీ తినకుండానే బడికి వచ్చి మధ్యాహ్నం వరకు పస్తులుండాల్సి వస్తోంది.

వారంలో మూడు రోజులు

ప్రతి విద్యార్థికి పది గ్రాముల రాగి పౌడర్, బెల్లంతో కలిపి మరగబెట్టిన జావను వారంలో మూడు రోజుల పాటు అందిస్తున్నారు. నిర్వహణ బాధ్యతను మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలకు అప్పగించారు. రాగిజావ తయారీ కోసం ఉదయాన్నే పాఠశాలకు వెళ్తున్నా శ్రమకు తగిన ప్రతిఫలం ఉండటం లేదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా పలు చోట్ల నామమాత్రంగా పంపిణీ చేశారనే ఆరోపణలున్నాయి. గతంలో ఎదురైన అడ్డంకులు అధిగమిస్తేనే పోషక మిళితమైన జావ పిల్లలకు అందనుంది. పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలో 1,28,571 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.

గతేడాది నుంచి రాష్ట్రవ్యాప్తంగా..

ప్రభుత్వ పాఠశాలల్లో పోషకాహార లోపం నివారించేందుకు, ఉదయం విద్యార్థుల ఆకలి తీర్చేందుకు మూడేళ్ల కిందట ఎంపిక చేసిన జిల్లాల్లో సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు పూర్తి సహకారంతో రాగిజావ పంపిణీ కార్యక్రమం అమలు చేశారు. సత్ఫలితాలు రావడంతో గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వం, సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో రాగిజావ పంపిణీ చేశారు. ఈ ఏడాది జూన్‌లో 6 రోజులు, జులైలో 11 రోజులకే సామగ్రి రావడంతో అక్కడి వరకే పంపిణీ చేశారు. ప్రభుత్వంతో సంస్థ ఒప్పందం కుదుర్చుకోవడంలో జాప్యం జరగడంతో మూడు నెలలుగా పథకం నిలిచిపోయింది.

ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలోని ఓ పాఠశాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పి.వెంకటస్వామిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. తొమ్మిదో తరగతి చదివే బాలికను వేధించాడన్న ఫిర్యాదుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు పట్టణ సీఐ సూరం వేణుగోపాల్ తెలిపారు. అశ్లీల చిత్రాలను చూపిస్తూ వేధించాడని బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఎస్సై శ్వేత సస్పెన్షన్



జగిత్యాల, న్యూస్‌టుడే: కోరుట్ల ఎస్సైగా పనిచేసిన శ్వేత సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇటీవల జగిత్యాలకు చెందిన బొల్లారపు శివ ప్రసాద్‌ను ఠాణాకు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించగా అవమాన భారంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో ఆమెను జిల్లా హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ పూర్తిస్థాయి నివేదిక సమర్పించిన నేపథ్యంలో మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఎస్సై శ్వేతను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎల్ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి, న్యూస్‌టుడే: రాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయం నుంచి ఎల్ఎండీకి శుక్రవారం నీటిని విడుదల చేశారు. జలాశయం రెండు గేట్ల నుంచి 4,761 క్యూసెక్కులు వదులుతున్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 27.14 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

తేమతో తగ్గిన కొత్త పత్తి ధర

జమ్మికుంట, న్యూస్‌టుడే : జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం అధిక తేమతో కొత్త పత్తి ధర తగ్గింది. యార్డుకు 38 ట్రాలీల కొత్త పత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. బిడ్డింగ్‌లో కొత్త విడి పత్తి క్వింటా కనిష్ఠ ధర రూ.6,000.. గరిష్ఠ ధర రూ.6,750 పలికింది. గురువారం గరిష్ఠ ధర రూ.6900లు నమోదు కాగా రోజు వ్యవధిలోనే రూ.150 తగ్గింది. 58 క్వింటాళ్ల బస్తాల పత్తి విక్రయానికి రాగా రూ.5,500 నుంచి రూ.6,700 దాకా వ్యాపారులు ఖరీదు చేశారు. ఏడు ట్రాలీల పాత విడిపత్తి విక్రయానికి రాగా రూ.7,200 నుంచి రూ.7,400 వరకు వెచ్చించి వ్యాపారులు ధరను నిర్ణయించారు. రైతులు కొత్తపత్తిని ఏరగానే నేరుగా యార్డుకు విక్రయానికి తీసుకు వస్తున్నారని తేమతో ధర తగ్గుతోందని మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం తెలిపారు. రానున్న సీజన్ కోసం స్థానిక జిన్నింగ్ మిల్లుల్లో యంత్రాల పరిశీలన, మరమ్మతు పనులు చేపట్టడంతో దీపావళి తర్వాతే మిల్లుల వ్యాపారులు కొనుగోళ్లు చేపట్టనున్నారు. ప్రస్తుతం కొత్త పత్తిని చిన్న వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

రాజన్న గోశాలలో మూడు కోడెల మృతి

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి చెందిన తిప్పాపూర్ గోశాలలో శుక్రవారం మూడు కోడెలు అస్వస్థతకు గురై మృతి చెందాయి. మృతి చెందిన వాటిని మూలవాగులో గోశాల సిబ్బంది పూడ్చి వేశారు. జెర్సీ బ్రీడ్‌కు సంబంధించినవి కావడంతో ప్రస్తుతం ఎండల వేడికి తట్టుకోలేక రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యాయని, వైద్యం అందించినప్పటికీ కోలులేక మృతి చెందినట్లు గోశాల పశువైద్య సహాయకుడు సాయి తెలిపారు.

16 నుంచి బీఫార్మసీ పరీక్షలు

కరీంనగర్ కలెక్టరేట్ : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించే బీఫార్మసీ ఆరో, అయిదో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 16, 17 తేదీల నుంచి నిర్వహించనున్నట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ అయిదో సెమిస్టర్ పరీక్షలు 17 నుంచి జరగనున్నట్లు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా... (10 AM TO 1 PM)

జగిత్యాల 94400 23123
కోరుట్ల 9491324656 ధర్మపురి 94403 88638

న్యూస్‌టుడే, సారంగాపూర్

? బీర్‌పూర్‌లో నిరుపయోగంగా ఉన్న ఫ్లోరైడ్ రహిత మంచినీటి పథకాన్ని తిరిగి పునఃప్రారంభిస్తామని ఇటీవల ప్రకటించారు. ఎప్పటిలోగా పనులు పూర్తి చేస్తారు. **- చుంచు అభిలాష్‌యాదవ్, నర్సింహులపల్లె**

✓ ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి ప్రతిపాదనలు తయారు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. **- డీఈఈ, తాగునీటి సరఫరా విభాగం**

న్యూస్‌టుడే, మల్లాపూర్

? మల్లాపూర్‌లో దారి వెంట వెళ్తున్న పిల్లలతో పాటు పెద్దవారిని వీధి కుక్కలు గాయపరుస్తున్నాయి. కుక్కలను నియంత్రించాలి.
- ఎన్.రాజేశ్వర్, మల్లాపూర్

✓ కుక్కల నియంత్రణకు త్వరలోనే చర్యలు తీసుకుంటాం.
- శ్రీనివాస్, ఈవో మల్లాపూర్

నిరుపయోగంగా కూరగాయల మార్కెట్

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే: రాయికల్ మేజర్ గ్రామ పంచాయతీ నుంచి పురపాలక సంఘంగా మారిన తర్వాత పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వసతులు కల్పించాలనే ఉద్దేశంతో పుర అధికారులు గతంలో ఉన్న కూరగాయల మార్కెట్‌ను విస్తరించారు. రూ.10 లక్షలతో కూరగాయలతోపాటు మాంసం, చేపల విక్రయాలు జరిపేలా నూతన షెడ్లు నిర్మించారు. కుక్కలు, పందులు మార్కెట్‌లోకి రాకుండా నివారించేందుకు ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేశారు. కొందరు కూరగాయల వ్యాపారులు, వీధి వ్యాపారులు ప్రధాన రహదారులపైనే విక్రయాలు జరపడంతో ప్రత్యేకంగా నిర్మించిన మార్కెట్‌లోకి ప్రజలు వచ్చి కొనుగోళ్లు జరపడం లేదు. దీంతో గిరాకీ లేక విధి లేని పరిస్థితుల్లో ప్రధాన రహదారిపైకి మార్చడంతో లక్షలు వెచ్చించి నిర్మించిన నిర్మాణాలు నిరుపయోగంగా మారాయి. ఇటీవల బల్దియా అధికారులు రహదారులపై విక్రయాలు జరపకుండా చర్యలు తీసుకున్నా కూరగాయల వ్యాపారులు, రైతులు అక్కడే విక్రయాలు జరుపుతున్నారు. కొందరు వ్యాపారులు రహదారులపై దుకాణాలు అద్దెకు తీసుకొని కూరగాయల విక్రయాలు జరుపడంతో మార్కెట్‌లోకి వినియోగదారులు రావడం లేదని అందుకే రహదారులపై విక్రయాలు జరుపుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. మరో వైపు జంతువులు రాకుండా ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్ ధ్వంసం కావడంతో కాలనీలో మురుగు కాల్వపై నిరుపయోగంగా పడేశారు.


మురుగుకాల్వపై ఇనుప గ్రిల్స్


కూరగాయల మార్కెట్

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు


ధర్మపురిలో స్వామివారి ఊరేగింపు సేవ


మెట్‌పల్లిలోని హనుమాన్‌నగర్‌లో కుంకుమ పూజలు


వెన్గుమట్లలో గాయత్రీ దేవి రూపంలో అమ్మవారు

ధర్మపురి: ధర్మపురిలోని శ్రీ రామలింగేశ్వరాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. రాత్రి వేళలో శేష వాహనసేవపై ధర్మపురి పురవీధుల్లో స్వామి వారిని ఊరేగించారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు. దేవస్థానానికి శుక్రవారం రూ.80,401 ఆదాయం సమకూరింది.

గొల్లపల్లి: గొల్లపల్లి, చిల్వాకోడూర్, శ్రీరాములపల్లి, లొత్తునూర్, వెన్గుమట్ల తదితర గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శ్రీరాములపల్లి ఆలయంలోని దుర్గాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఏఎంసీ ఛైర్మన్ సంతోష్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి పట్టణం: దేవీశరన్నవరాత్రులు మెట్‌పల్లిలో భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. పట్టణంలోని వాసవిమాత ఆలయంలో ఆర్యవైశ్యుల అమ్మవారికి రెండోరోజు అభిషేకాలు నిర్వహించారు. హనుమాన్‌నగర్ అభివృద్ధి సొసైటీ ఆధ్వర్యంలో దుర్గామాత మండపం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

మెట్‌పల్లి: నవరాత్రోత్సవాల్లో భాగంగా మెట్‌పల్లి పట్టణంలోని హనుమాన్‌నగర్ డెవలప్‌మెంట్ సొసైటీ, ఆర్యనగర్‌లో దుర్గాదేవి మండపాల వద్ద శుక్రవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. వెల్లుల్ల, జగ్గాసాగర్, బండలింగాపూర్, మేడిపల్లి, వెంపేట తదితర గ్రామాల్లో నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.


మల్లాపూర్‌లో..

మల్లాపూర్: మండల కేంద్రంలోని శ్రీవాసవీ మాత ఆలయంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం మహిళలు కుంకుమపూజలు చేశారు.

రాయికల్: మండలంలోని మైతాపూర్, అల్లీపూర్, ఇటిక్యాల, కిష్టంపేట, ఆలూరు, రామాజిపేట, మూటపల్లి తదితర గ్రామాల్లోని దుర్గ మండపాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.


మైతాపూర్‌లోని శ్రీగిరి గుట్టపై..

ఆత్మరక్షణ విద్యలో నైపుణ్యం పెంపొందించుకోవాలి

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: ఆత్మరక్షణ విద్యలో ప్రతి ఒక్కరు నైపుణ్యం పెంపొందించుకోవాలని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు అన్నారు. మెట్‌పల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో జపాన్ కరాటే షోటో ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా చీఫ్ శిక్షకులు ఎంఎస్ పాషా, పసునూరి అవినాష్ శుక్రవారం విద్యార్థులకు కరాటే బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు డీఎస్పీ, సీఐ నిరంజన్‌రెడ్డిలు బెల్టులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. టెక్నికల్ డైరెక్టర్ ప్రభాకర్, గంగాధర్, నరసింహరెడ్డి తదితరులున్నారు.


బెల్టులు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి

రత్నాకర్‌రావు సేవలు చిరస్మరణీయం

ధర్మపురి, న్యూస్‌టుడే: దివంగత మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ధర్మపురి పట్టణంలో రత్నాకర్‌రావు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షురాలు సంగి సత్తెమ్మ, రత్నాకర్‌రావు తనయుడు కృష్ణారావు, దినేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


రత్నాకర్‌రావు విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

జగిత్యాల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని మాజీ ఎమ్మెల్యే జిల్లా భారాస అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వానాకాలం సీజన్ దాటుతున్నా రైతుభరోసా ఇవ్వలేదని సగం మందికి రుణమాఫీ వర్తింపచేయలేదన్నారు. పట్టణ ప్రజలు ప్రతిరోజూ దర్శలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని హైడ్రా పేరుతో ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఓ మహిళా సాటి మహిళలను కించపరిచే విధంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కేటీఆర్‌పై చేసిన ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నామని విద్యాసాగర్‌రావు అన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వసంత అన్నారు. పట్టణ భారాస అధ్యక్షుడు గట్టు సతీష్, ముఖ్య నాయకులు వొళ్లం మల్లేశం, సమిండ్ల శ్రీనివాస్, ఆనందరావు, శీలం ప్రవీణ్, దామోదర్‌రావు, అమీన్, గంగారెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

చంద్రప్రభ వాహనంపై చెన్నకేశవస్వామి

మెట్‌పల్లి పట్టణం: శరన్నవరాత్రుల్లో భాగంగా శ్రీచెన్నకేశవస్వామి చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరై స్వామివారికి హారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



క్రైం కార్నర్

పాముకాటుతో మహిళా కూలీ మృతి


లక్ష్మి

కోరుట్ల, న్యూస్‌టుడే: కథలాపూర్ మండలం తాండ్ర్యాల గ్రామంలో పత్రి లక్ష్మి(33) అనే మహిళా కూలీ పాముకాటుతో శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. లక్ష్మి శుక్రవారం ఉదయం మొక్కజొన్న పంట కోసేందుకు వెళ్లింది. కర్రలను కోస్తుండగా పాముకాటు వేయగా చికిత్స కోసం కోరుట్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృత్యువాతపడ్డట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి భర్త జలందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

మృతదేహం గుర్తింపు


మల్లేశం

కోరుట్ల, మేడిపల్లి, న్యూస్‌టుడే: కథలాపూర్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన మల్లేశం(30) మృతదేహం శుక్రవారం గుర్తించినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. మల్లేశం మూడు రోజుల కిందట మండలంలోని దుంపేట శివారులోని వరద కాలువలో పడి అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం తెలిసిందే. పోలీసులు వరద కాలువ వెంబడి గాలింపు చర్యలు చేపట్టగా మేడిపల్లి మండలం విలయతాబాద్ గ్రామశివారులో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి సీఐ సురేశ్‌బాబు, కథలాపూర్, మేడిపల్లి ఎస్సైలు నవీన్‌కుమార్, శ్యాంరాజ్‌లు చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. మృతిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టామని సీఐ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

కొడిమ్యాల, న్యూస్‌టుడే: కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామ అనుబంధ గ్రామమైన ఆరెపల్లి గ్రామంలోని జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురానగర్ గ్రామానికి చెందిన మొగిళ్ల రమేష్, చింతలతాడెం మహేష్ వేర్వేరు ద్విచక్రవాహనాలపై పూడూర్ నుంచి గంగాధర వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనాలు ఆరెపల్లి వద్దకు చేరుకోగానే వెనక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం రమేష్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో రమేష్ ద్విచక్రవాహనం పక్కనే వస్తున్న మహేష్ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరూ కిందపడిపోవడంతో రమేష్ తలకు తీవ్రగాయాలై రక్తస్రావం జరిగింది. పోలీసులు, స్థానికులు రమేష్‌ను అంబులెన్స్‌లో జగిత్యాల ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పరస్పర దాడిలో..

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల పట్టణం ఖిలాగడ్డ ప్రాంతంలో గురువారం రాత్రి పాతకక్షలతో ఇద్దరు వ్యక్తులు పరస్పరం దాడికి దిగారు. ఇనుప రాడ్‌తో దాడి చేయగా ఫయిమ్ అనే వ్యక్తి మెడపై తీవ్ర గాయమై రక్తస్రావం జరిగినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించినట్లు తెలిపారు.

భూ వివాదంలో కేసు

సారంగాపూర్, న్యూస్‌టుడే: భూ వివాదంలో పరస్పర దాడులు చేసుకున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. మండలంలోని అర్పపల్లికి చెందిన ఎద్దండి సంతోష్, మోహన్‌రెడ్డి, సరళలకు ఇదే గ్రామానికి చెందిన ముత్యాల తిరుపతిరెడ్డి, కళావతిల మధ్య భూవివాదం నెలకొంది. ఈ విషయంలో దూషించుకొని, పరస్పర దాడులు చేసుకోవడంతో శుక్రవారం అయిదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

డిజిటల్ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

కోరుట్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డిజిటల్ సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కోరుట్ల మండలం సర్వరాజ్‌పల్లెలో అధికారులు రెండోరోజు చేపడుతున్న డిజిటల్ సర్వే పరిశీలించారు. అధికారులు నమోదు చేసిన కుటుంబ సభ్యుల వివరాల పత్రాలను తనిఖీ చేశారు. ఇంటింటికీ తిరిగి ప్రతి కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు తప్పులు లేకుండా నమోదు చేయాలని పేర్కొన్నారు. ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


కోరుట్ల మండలం సర్వరాజ్‌పల్లెలో పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

చేనేత ఉత్పత్తులను ప్రభుత్వం ప్రోత్సహించాలి

కోరుట్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శుక్రవారం కోరుట్ల పట్టణ శివారులో పద్మశాలి కులోన్నతి సంఘానికి ప్రభుత్వ స్థలం కేటాయించి రూ.50 లక్షల నిధులతో భవన నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. నేతన్నలకు మంచి రోజులు రావాలని కోరారు. కమిషనర్ తిరుపతి, సంఘ అధ్యక్షుడు గుంటుక ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, సాంబమూర్తి, కిషోర్, బాలె నర్సయ్య, మధు, ప్రసాద్, నవీన్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.


కోరుట్లలో నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డా.సంజయ్

క్రీడానైపుణ్యాలు పెంచుకోవాలి

మల్యాల, న్యూస్‌టుడే: యువకులు క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. మల్యాల అడ్డ రోడ్డు సమీపంలో శుక్రవారం ఎం.ఎస్ వారియర్స్ క్రికెట్ టోర్నీ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆనందరెడ్డి, రాంమోహన్‌రావు, ఆదిరెడ్డి, రాంలింగారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సతీష్‌రెడ్డి, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.


క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే సత్యం

భజన మందిరానికి భూమి పూజ

జగిత్యాల విద్యానగర్ : జగిత్యాల పట్టణం హనుమాన్‌వాడలోని బీయరయ్య దేవాలయం వద్ద తితిదే నిధులతో చేపట్టిన భజన మందిర నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ శుక్రవారం భూమిపూజ చేశారు. ఇస్లాంపురాకు చెందిన కైసర్ బేగంకు రూ.60 వేల విలువైన సీఎం సహాయనిధి చెక్కును అందచేశారు. పురపాలక అధ్యక్షురాలు అడువాల జ్యోతి, మాజీ అధ్యక్షుడు గిరి నాగభూషణం, గంగమల్లు, మల్లికార్జున్, రాజేశ్, పద్మ, ధర్మరాజు, అనిల్, నవీన్, మల్లయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.


స్వశక్తి సంఘాల మహిళలతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

ఇందిరా మహిళా శక్తితో అభివృద్ధి

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల 37వ వార్డు, పోరండ్ల, వెల్దుర్తి గ్రామాల్లో పథకం కింద ఎంపికైన లబ్ధిదారుల దుకాణాలను ప్రారంభించారు. పురపాలక ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి, ఏపీఎం గంగాధర్, పురపాలక మాజీ ఛైర్మన్ గిరినాగభూషణం, కౌన్సిలర్లు కూతురు రాజేష్, కూసరి అనిల్, తోట మల్లికార్జున్, క్యాదాసు నవీన్, పిట్ట ధర్మారాజు, అల్లె గంగసాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నుంచి మధ్యమానేరుకు 10 వేల క్యూసెక్కులు

జగిత్యాల ధరూర్‌క్యాంపు : శ్రీరామసాగర్ జలాశయం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు వరదకాలువకు 10 వేల క్యూసెక్కుల నీటిని విడుదలచేస్తూ మధ్యమానేరు జలాశయానికి తరలిస్తున్నారు. ఎస్సారెస్పీలోకి ప్రస్తుతం 19,725 క్యూసెక్కుల వరద వస్తుండగా జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి, కాకతీయ కాలువకు(ఎల్ ఎండీ ఎగువ వరకు) 6,800, లక్ష్మీ కాలువకు 150, సరస్వతి కాలువకు 500, గుత్ప ఎత్తిపోతలకు 135, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో నీటినిల్వ 80.501 టీఎంసీలుగా ఉంది.

ఉమ్మడి జిల్లాకు అతితేలికపాటి వర్షసూచన: ఉమ్మడి జిల్లాలో రాగల అయిదురోజుల్లో అక్కడక్కడ అతి తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షసూచన ఉందని పొలాస పరిశోధనస్థానం శాస్త్రవేత్త బి.శ్రీలక్ష్మి తెలిపారు. ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 23 డిగ్రీలు, గరిష్ఠంగా 36 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతాయని వివరించారు.

బతుకమ్మ సంబరాలు


ధర్మపురిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


మెట్‌పల్లి వాగ్దేవి డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు

జగిత్యాల విద్యానగర్: జగిత్యాల పట్టణంలోని నలంద డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు శుక్రవారం నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాయికల్ పట్టణం: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగు రంగు పూలతో బతుకమ్మను పేర్చి పాటలు, కోలాటాలతో ఉత్సాహంగా గడిపారు. ప్రిన్సిపల్ రాజేశ్, రజిత, ఉషారాణి, శ్రీనివాస్, దేవేందర్, రవీందర్, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: మెట్‌పల్లి పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు భక్తిశ్రద్ధలతో పూలతో బతుకమ్మను పేర్చి పాటలు పాడుతూ కోలాటం ఆడారు. ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు జరిపి నిమజ్జనం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ కోలు రవి, అధ్యాపకులు స్రవంతి, సౌజన్య, స్వప్న, శ్రీనివాస్, సాగర్, కిషోర్, రాజేంద్రప్రసాద్, విద్యార్థినులు పాల్గొన్నారు.

ధర్మపురిలో...

ధర్మపురి : ధర్మపురిలో శుక్రవారం రాత్రి ముద్దపప్పు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గోదావరి నదీ తీరంలో మహిళలు బతుకమ్మలను ఉంచి ఆడారు. పెద్ద సంఖ్యలో పట్టణ మహిళలు పాల్గొన్నారు.


జగిత్యాలలో..


రాయికల్‌లో..

అలరించిన స్వాగతోత్సవం

మల్యాల, న్యూస్‌టుడే: మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం 'ఫ్రెషర్స్ డే'ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో అన్ని వసతులు ఉన్నాయని, నిష్ణాతులైన అధ్యాపకుల బోధనలో విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ప్రిన్సిపల్ శివరామకృష్ణ, ఎస్టీవో తిరుపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థినుల నృత్యం

సంక్షిప్తం

ముగిసిన గ్రామీణ మంచినీటి సహాయకుల శిక్షణ

కోరుట్ల: కోరుట్ల మండల పరిషత్ కార్యాలయంలో కోరుట్ల, కథలాపూర్ మండలాలకు చెందిన గ్రామీణ మంచినీటి సహాయకులకు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. గ్రామాల్లో ప్రజలకు మంచినీటి సరఫరా, విద్యుత్తు మోటార్ల మరమ్మతు, నీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారం, ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో కృపాకర్, డీఈ ఆనంద్, ఏఈ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై ధాన్యం కుప్పలు వేయరాదు

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో రహదారులపై మొక్కజొన్న, వరి ధాన్యం కుప్పలను ఉంచవద్దని ఎస్సై అనిల్ రైతులను కోరారు. రహదారులపై మొక్కజొన్న, వరి ధాన్యం కుప్పలను ఉంచడం ద్వారా రాత్రిళ్లు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఒకవేళ ధాన్యం కుప్పలను ఉంచితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

జగిత్యాల-కడెం బస్సు పునఃప్రారంభం

రాయికల్, న్యూస్‌టుడే: జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి రాయికల్ మండలం బోర్నపల్లి మీదుగా నిర్మల్ జిల్లా కడెంకు ఆర్టీసీ బస్సును పునఃప్రారంభించారు. ఉ.6:50, 11:00, మధ్యాహ్నం 3:20 గంటలకు జగిత్యాల నుంచి కడెం బస్సు బయలు దేరుతుంది. తిరిగి ఉదయం 9:10, మధ్యాహ్నం 01:00, సాయంత్రం 5.00 గంటలకు కడెం నుంచి జగిత్యాలకు వస్తుంది. బస్సు పునఃప్రారంభంతో ఇరు జిల్లాల మధ్య రాకపోకలు పెరగనున్నాయి.

ఎమ్మార్పీఎస్ సమావేశం

జగిత్యాల విద్యానగర్: జగిత్యాల పట్టణం గాంధీనగర్‌లోని సంఘ భవనంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ మేరకు ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డి తీరుకు వ్యతిరేకంగా, వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణమాదిగ సూచన మేరకు ఈ నెల 9న నల్ల జెండాలతో నిరసన తెలియచేయనున్నట్లు చెప్పారు. గంగారాం, సతీష్, కాంత, కిషన్, రమేశ్ పాల్గొన్నారు.

కొండగట్టులో మహిళాశక్తి క్యాంటీన్ ప్రారంభం

మల్యాల: కొండగట్టు(దిగువ) ప్రాంతంలో శుక్రవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మహిళాశక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. స్వశక్తి సంఘ సభ్యురాలైన రూప క్యాంటీన్ ఏర్పాటు కోసం స్త్రీనిధి ద్వారా రూ.లక్ష, గ్రామైక్య సంఘం ద్వారా రూ.1.50 లక్షలను వడ్డీలేని రుణంగా అందజేసినట్లు ఐకేపీ అధికారులు తెలిపారు. తహసీల్దారు మునిందర్, ఎంపీడీవో స్వాతి, ఐకేపీ ఏపీఎం రాజయ్య పాల్గొన్నారు.

దళితుల ఫిర్యాదు

మెట్‌పల్లి : మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో దసరా ఉత్సవాల సందర్భంగా దేవుడి ఊరేగింపు(శావ) తమ కాలనీలోకి రాకుండా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దళితులు శుక్రవారం సాయంత్రం మెట్‌పల్లిలో డీఎస్పీ, ఆర్డీవో కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. అయిదేళ్లుగా తమ కాలనీలోకి ఊరేగింపు తీసుకురావాలని కోరుతున్నా అడ్డుకుంటున్నారన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

ధర్మపురి: లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.

నడుస్తున్న కారులో హత్యాయత్నం.. ఏడుగురి అరెస్టు

బెజ్జంకి : ఆర్థిక లావాదేవీల విషయంలో సిద్దిపేట జిల్లా రాజీవ్ రహదారిపై నడుస్తున్న కారులోనే యువకుడిపై కత్తితో దాడి చేస్తూ హత్యాయత్నం జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు నిందితులను శుక్రవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బెజ్జంకికి చెందిన సోమని ప్రవీణ్ కోరుట్లలో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. బెజ్జంకికి చెందిన వేల్పుల శ్రీకాంత్, వేల్పుల శ్రీను, వేల్పుల చందుతో ఆర్థిక వ్యవహారాలపై కొద్ది రోజులుగా గొడవ జరుగుతోంది. తమ డబ్బులు ఇవ్వడం లేదని వారు ప్రవీణ్‌పై కక్ష పెంచుకున్నారు. ఈ నెల 3న తన కారులో హైదరాబాద్‌కు ప్రవీణ్ వెళ్తున్నారని నిందితులు తెలుసుకున్నారు. కరీంనగర్‌కు చెందిన హరీశ్, మహేందర్, బెజ్జంకికి చెందిన సందీప్, శ్రీహరి సాయాన్ని తీసుకున్నారు. రెండు కార్లలో మాటు వేసి సిద్దిపేట జిల్లా తోటపల్లి రాజీవ్ రహదారి శివారుకు చేరుకోగానే ప్రవీణ్ వాహనాన్ని అడ్డగించారు. అందులోని ప్రయాణికులను బెదిరించి అక్కడి నుంచి వెళ్లగొట్టారు. కారులోకి ఎక్కి నిందితుల్లో ఒకరు కారును నడిపారు. సుమారు 3 కి.మీ. దూరం వరకు ప్రవీణ్‌ను కొడుతూ, కత్తితో దాడి చేశారు. అనంతరం నిందితులు పరారయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ప్రవీణ్‌ను హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలించి పట్టుకున్నారు. వారి నుంచి రెండు కార్లు, ఏడు ఫోన్లు, కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

మాజీ మంత్రి రత్నాకర్‌రావు జయంతి

మల్లాపూర్: మల్లాపూర్ మండల కేంద్రంలో శుక్రవారం మాజీ మంత్రి రత్నాకర్‌రావు జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రత్నాకర్‌రావు చేసిన సేవలను కొనియాడారు.

మహిళా అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

కొడిమ్యాల: రాష్ట్రంలోని మహిళల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండల కేంద్రంలోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను శుక్రవారం ప్రారంభించారు.